సబ్‌జైలును సందర్శించిన జడ్జీ కీర్తి చంద్రికరెడ్డి

రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి కీర్తి చంద్రికరెడ్డి

ఇల్లెందు రూరల్, జూలై 30: ఇల్లెందులోని సబ్ జైలును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ దేవరపల్లి కీర్తిచంద్రికరెడ్డి మంగళవారం సందర్శించారు. తొలుత రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జైలులో పరిశుభ్రతను పాటించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. ఖైదీలకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ ఎస్ చంద్రశేఖర్, హెడ్‌వార్డెన్ భుజంగరాజు, సిబ్బంది శ్రీనివాస్, న్యాయవాదులు ఉమామహేశ్వర్‌రావు, కీర్తి కార్తీక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలి

అశ్వారావుపేట టౌన్, జూలై 30: విద్యార్థుల్లో దాగిఉన్న సామర్థ్యాలను వెలికితీసేందుకు శిక్షణలు దోహదపడతాయని ఎంఈవో కీసర లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న నాస్ శిక్షణను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఇటువంటి శిక్షణలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ప్రసాదరావు, కాప్లెంక్స్ హెచ్ఎం పీ హరిత తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

దమ్మపేట, జూలై 30: మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సాయికిషోర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'యాక్షన్ ఫర్ ఇంటిగేటెడ్ సొసైటీ' ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గున్నేపల్లి పాఠశాలలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ సోషల్ మీడియాలో అవసరం లేని వ్యక్తిగత వివరాలతో మానవ అక్రమ రవాణాకు అవకాశాలు వున్నాయన్నారు. గ్రామాల్లో అనుమానితులు కనపడితే వెంటనే దగ్గరలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐడీ సంస్థ ప్రతినిధి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థులతో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

మణుగూరు టౌన్, జూలై 30: మానవ తప్పిదం వల్ల కానీ, విధి వైపరీత్యాల వల్ల కానీ వచ్చే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాఘవరెడ్డి అన్నారు. మంగళవారం హనుమాన్ ఫంక్షన్‌హాల్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సీఐ సతీష్‌కుమార్, ఎస్సై మేడ ప్రసాద్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం అధికారులు పాల్గొన్నారు.

చర్లలో బోనాల సంబురాలు

చర్ల, జూలై 30: మండల కేంద్రం చర్లలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాడమాసం చివరి మంగళవారం భక్తులు బోనాల సంబురాలు నిర్వహించారు. అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. భక్తులు అమవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కొంతమంది భక్తులకు పూనకాలు వచ్చాయి.

'సీతారామ' కాల్వలో పడి విద్యార్థి మృతి

దమ్మపేట, జూలై 30 : సీతారామ కాల్వలో పడి ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం ఆర్లపెంట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. అయితే ఉపాధ్యాయురాలి నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతిచెందాడని ఆరోపిస్తూ గ్రామస్తులు పాల్వంచ రహదారిపై ఆందోళన చేశారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆర్లపెంటలోని ప్రాథమిక పాఠశాలలో ఆదే గ్రామానికి చెందిన తోలెం వరుణ్(7) 2వ తరగతి చదువుతున్నాడు. ఇంటర్‌వెల్ సమయంలో మరో ఇద్దరు విద్యార్థులతో కలిసి పాఠశాల వెనుక ఉన్న నీటి వాగులో ఆడుకొని బట్టలు తడుపుకున్నాడు. దీంతో తడి బట్టలు మార్చుకొని రావాలని ఉపాధ్యాయురాలు ముగ్గురు విద్యార్థులను ఇంటికి పంపించారు. ఈ క్రమంలో వీరు ఇంటికి వెళ్లకుండా గ్రామ శివారులోని సీతారామ ప్రాజెక్టు కాల్వలోని నీటిలో ఆడుకునేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు వరుణ్ నీటిలో మునిగిపోవడాన్ని గమనించిన తోటి విద్యార్థులు భయంతో ఇంటికి పరుగులు పెట్టారు. అటుగా వెళ్తున్న రైతు బాలరాజు వరుణ్‌ను కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తల్లిదండ్రులతో కలిసి పాఠశాల వద్దకు వచ్చి వరుణ్ మృతికి ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ పాల్వంచ రోడ్డుపై రాస్తారోకో చేశారు. దీంతో జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎస్సై సాయికిశోర్‌రెడ్డి గ్రామస్తులతో చర్చలు జరిపి రాస్తారోకో విరమింపజేశారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

వరుణ్‌కు మెచ్చా నివాళి

దమ్మపేట, జూలై 30: సీతారామ కాలువలో పడి విద్యార్థి తోలెం వరుణ్ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మండలంలోని ఆర్లపెంట గ్రామానికెళ్లి వరుణ్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు సంతాప, సానుభూతి వ్యక్తం చేశారు.

పెదవాగు ప్రాజెక్టు రింగ్‌బండ్ పనులు ప్రారంభం

అశ్వారావుపేట రూరల్, జూలై 30: మండలంలోని గుమ్మడవల్లి గ్రామ సమీపంలోని పెదవాగు ప్రాజెక్టు ఇటీవల కురిసిన వర్షాలకు భారీగండి పడింది. మంగళవారం ఇరిగేషన్ అధికారులు గేట్లు వద్ద 1రింగ్‌బండ నిర్మాణ పనులను చేపట్టారు. రమణక్కపేట వైపు నుంచి ప్రాజెక్టు పనులు ప్రారంభింomr ప్రాజెక్టు లోపల రింగ్ బండ్ నిర్మాణ పనుల వైపుకు వాహనాలు వెళ్లెందుకు పనులు చేపట్టారు. పనులను ఐబీ డీఈఈ మోతీలాల్, ఏఈలు నవీన్,మోహన్‌వంశీ పర్యవేక్షిస్తున్నారు.

గణేష్‌టెంపుల్ ఈవోగా రజినికుమారి

కొత్తగూడెం టౌన్, జూలై 30: జిల్లా కేంద్రంలోని ఎంజీరోడ్‌లో ఉన్న విజయవిఘ్నేశ్వర స్వామి ఆలయన ఈవోగా రజినీకుమారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, అర్చకులు ఈవోకు అభినందనలు తెలిపారు.

పాల్వంచ మున్సిపల్ కమిషనర్ బదిలీ

పాల్వంచ, జూలై 30: పాల్వంచ మున్సిపల్ కమిషనర్ స్వామి గుండ్లపోచమ్మపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. గ్రేటర్ హైదరాబాద్‌లో పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ డి ధను నాయక్‌ను పాల్వంచ కమిషనర్‌గా బదిలీపై రానున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఉత్వర్వులు వచ్చాయి.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

మాట్లాడుతున్న లక్కినేని సురేందర్‌రావు

టేకులపల్లి, జూలై 30: గతంలో అనుభవదారి కాలంలో ఉన్న రైతులకు వ్యవసాయ రుణాలు ఇచ్చారని, ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం ఇస్తున్న రుణమాఫీ పట్టాలు ఉన్న వారికే మాఫీ వస్తుందని, భూమి ఉండి వ్యవసాయ రుణం తీసుకున్న ప్రతి ఒక్కరికి మాఫీ చేయాలని బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్ రైతు వేదికలో రైతు రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డితో రెండో విడత రుణమాఫీ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తొలి విడత రుణమాఫీలో చాలా మంది రైతులు ఈకేవైసీ చేసుకోక, బ్యాంక్‌లో డేటా సరిగా ఎంటర్ చేయకపోవడంతో రుణమాఫీ వర్తించలేదని, దానిని సరిచేసి పంపించామన్నారు. రానివారందరికీ రుణమాఫీ వస్తుంన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, ఎంఏవో అన్నపూర్ణ, సొసైటీ సీఈవో ప్రేమాచారి, ఏఈవోలు శ్రావణి, రమేశ్, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుంది..

జూలూరుపాడు, జూలై 30: మండల పరిధిలోని కాకర్ల రైతు వేదికలో ముఖ్యమమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన రెండో విడత రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయ శాఖాధికారులతో పాటు బ్యాంకర్లు, రైతులు వీక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగాన్ని తిలకించారు. మండల వ్యవశాయ శాఖాధికారి రఘుదీపిక మాట్లాడుతూ.. మండలంలో రూ.1.50 లోపు రుణం ఉన్న అర్హులైన రైతులందరీ ఖాతాల్లో నగదు జమ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈవో రమణారెడ్డి, ఏఈవో లావన్య, రైతులు లింగారావు, పుల్లయ్య పాల్గొన్నారు.

మండలంలో 1180 మందికి..

దుమ్ముగూడెం, జూలై 30: రూ.1.50 లక్షల లోపు రుణాలు తీసుకున్న వారికి ఈ రెండో విడతలో రుణమాఫీ చేశారు. మండలంలో మొత్తం మూడు వేల మంది రైతులు అర్హులు కాగా కేవలం 1180 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించింది. మండలంలోని నర్సాపురం రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో రైతులకు మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్ పలు సూచనలు చేశారు. రైతుల ఖాతాల్లో నగదు జమ అయిన విషయాలను వెల్లడించారు. పట్టాదారు పాస్‌బుక్‌పైనే రుణాలు తీసుకున్నా కానీ తమ పేర్లు ఎందుకు రాలేదని రైతులు బ్యాంకుల వద్ద ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా రైతులందరికీ రుణమాఫీ అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

బొమ్మనపల్లిలో విద్యాంజలి ర్యాలీ

టేకులపల్లి, జూలై 30: శిక్షా సప్తాహ్‌లో భాగంగా బొమ్మనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం విద్యాంజలి ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం ఎం జ్యోతిరాణి పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి శిక్షా సప్తాహ్ ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం సమాజ భాగస్వామ్యం గురించి తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ భవాని, ఉపాధ్యాయులు పద్మ, నీరజ, శారద, సరోజ, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, విజయ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం

చండ్రుగొండ, జూలై 30: అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ఎస్‌కే ఉమర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కర్సలబోడు గ్రామంలో జరిగిన లింగన్న వర్ధంతి సభలో యన మాట్లాడారు. పేదల పక్షాన పోరాడే నాయకులపై కేసులు పెట్టడం, బూటకపు ఎన్‌కౌంటర్లు చేయటం మానుకోవాలన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రజాపాలన చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వీ వెంకట్రామ్, బాలు, రమేశ్, వీరన్న, లక్ష్మణ్, బద్రు, చిన్న రాజి, జ్యోతి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఇల్లెందు రూరల్, జూలై 30: సింగరేణి కన్వీనియన్స్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతిచెందిన జేకే 5 ఓసీ డీసీఎం డ్రైవర్ బబ్బి కుటుంబానికి యజమానులు, తోటి డ్రైవర్లు ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం బబ్బి కుటుంబసభ్యులను కలిసి పోస్టాఫీస్‌లో పిల్లల పేర్లు మీద రూ.50 వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాన్ని అందజేశారు. ఈ డబ్బులను పోస్టాఫీస్‌లో 9 సంవత్సరాల ఏడు నెలలకు ఫిక్స్ చేయించామన్నారు. కార్యక్రమంలో యాకూబ్‌షావలి, పాయం వెంకన్న, డ్రైవర్లు గోపి, అలిభాయ్, ప్రేమ్ పవన్, మధు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల ముందస్తు అరెస్టు

రామవరం, జూలై 30: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో హైదరాబాద్‌కు వెళ్లే ఆశా వర్కర్లను మంగళవారం కొత్తగూడెం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో నాగమ్మ, మనీలా ఉన్నారు.

అరెస్టులకు ఖండన

ఇల్లెందు రూరల్, జూలై 30: సీఐటీయూ హైదరాబాద్ చలో కమిషనరేట్ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆశావర్కర్లను నిలువరించడానికి చేసిన అరెస్టులను ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధాలపై నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్ల కోసం ఆశా వర్కర్లను నిర్బంధించడం సరికాదని పేర్కొన్నారు.

స్వల్పంగా పెరగనున్న గోదావరి

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 30 (నమస్తే తెలంగాణ) : భద్రాచలం వద్ద నిన్నటి వరకు తగ్గుముఖం పట్టిన గోదావరి వరద మంగళవారం రాత్రి వరకు స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఎగువన కురిసిన వర్షాలతో ప్రాజెక్టుల నుంచి నీరు వదలడం వల్ల మళ్లీ వరద నీరు పెరగొచ్చంటున్నారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద మంగళవారం సాయంత్రానికి 43 అడుగుల వరకు నీటిమట్టం ఉంది. మరో రెండు అడుగుల మేర పెరగొచ్చని అధికారులు చెబుతున్నారు. అయితే పట్టణంలోకి స్లూయిస్‌ల ద్వారా వచ్చిన వరద నీటిని మోటర్ల ద్వారా ఇరిగేషన్ అధికారులు తోడించకపోవడం వల్ల కొత్త కాలనీలో మంగళవారం ఉదయం నీరు వచ్చి చేరింది. దీంతో లోతట్టు ప్రాంత ప్రజలు ఆందోళన చెందడంతో అధికారులు నీటిని తొలగించారు.

జిల్లా తొలి ఫైర్ ఆఫీసర్‌గా క్రాంతికుమార్

జిల్లా కలెక్టర్ పాటిల్, ఎస్పీ రోహిత్ రాజును మార్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఫైర్ ఆఫీసర్

కొత్తగూడెం క్రైం, జూలై 30: జిల్లాకు తొలి ఫైర్ ఆఫీసర్ (డీఎఫ్‌వో)గా మురహరి క్రాంతి కమార్ నియమితులయ్యారు. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2009లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా ఎంపికైన ఆయన శిక్షణ అనంతరం ఖమ్మంలో తొలి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం భద్రాచలం స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా కొంతకాలం పని చేసి 2018లో బదిలీపై కొత్తగూడెం ఫైర్‌స్టేషన్‌కు వచ్చారు. 2022లో రంగారెడ్డి జిల్లాలోని ఫైర్ ట్రైనింగ్ సెంటర్‌కు వెళ్లారు. అక్కడే జిల్లా సహాయక ఫైర్ అధికారిగా ఉద్యోగోన్నతి పొంది రెండేళ్లపాటు పనిచేశారు. జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి లభించడంతో బదిలీపై జిల్లా ఫైర్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సుజాతనగర్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ బిరుదురాజు రోహిత్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

రైతులు లేక వెలవెలబోయిన రైతువేదిక

అశ్వారావుపేట టౌన్, జూలై 30: ప్రభుత్వం రెండో విడత రుణమాఫీ విడుదల సందర్భంగా మంగళవారం స్థానిక రైతువేదికలో నిర్వహించిన వీడియో వర్చువల్ కార్యక్రమంలో రైతులు లేక వెలవెలబోయింది. ఉదయం 10 గంటల నుంచి రైతువేదిక వద్దకు చేరుకున్న రైతులు రుణమాఫీ విడుదల కార్యక్రమం ఆలస్యమవ్వటంతో వచ్చిన రైతులు వెళ్లిపోయారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ నిర్మల పుల్లారావు, అశ్వారావుపేట సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, ఏవో నవీన్, విజయ్, సతీశ్, భాను పాల్గొన్నారు.

రైతు వేదికల వద్ద రైతుల నిరసన

ఆళ్ళపల్లి, జూలై 30: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు విడతలుగా రుణమాఫీ చేసిందని తమ పేర్లు లిస్టులో రాలేదని మండలంలోని రాయిపాడు, అనంతోగు, ముత్తాపురం గ్రామస్తులు మంగళవారం స్థానిక రైతు వేదికల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏ ఆధారంగా రుణమాఫీ చేసిందో అధికారులు తెలపాలని రైతులు పేర్కొన్నారు. జాబితాలో అర్హుల పేర్లు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు వేదిక వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నమస్తే కథనానికి స్పందన

ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చిన విద్యుత్ సిబ్బంది

చండ్రుగొండ, జూలై 30: పొలాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రైతులు 20 రోజులుగా అధికారుల చుట్టూ తిరిగిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. 'ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతుల ప్రదక్షిణ' అనే శీర్షికన మంగళవారం 'నమస్తే తెలంగాణ దినపత్రిక'లో ప్రచరితమైంది. స్పందించిన విద్యుత్ అధికారులు పోలాల వద్దకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మన్ ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ ఏడీ యాసిన్ మాట్లాడుతూ....రైతుల ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు సిబ్బంది కొరత, వానలు వస్తుండంతో కొంత జాప్యం జరిగిందని, రైతులు ఎప్పుడు వచ్చి అడిగిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ నర్సింహరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నాటు సారాయి, తయారీ సామగ్రి పట్టివేత

టేకులపల్లి, జూలై 30: ఇల్లెందు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం ఉదయం వాహనాలు తనిఖీ చేపట్టారు. మహీంద్రా డీసీఎం వ్యాన్‌లో నలుగురు వ్యక్తులు అనుమాన స్పదంగా కన్పించడంతో వారిని ఆపి వాహన తనిఖీ చేయగా నాటు సారాయికి వినియోగించే నల్లబెల్లం 8 టన్నులు, పటిక1,5క్వింటాలు, నాటు సారాయి 40లీటర్లు ఉన్నట్లు గుర్తించారు. ఆ నలుగురు వ్యక్తులు కర్లంపుడి గ్రామం కాకినాడకు చెందిన ఎలూరి వెంకటేశ్వర్లు, కడగలి గంగారాజు, కొత్తగూడెంకు చెందిన తుర్కేల్ విక్కి, టేకులపల్లి చెందిన జర్పుల బాబులు గా గుర్తించారు. కాకినాడ నుంచి కొత్తగూడెం మీదుగా టేకులపల్లి, ఇల్లెందు, మహబూబాబాద్‌కు బెల్లంను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ రాంప్రసాద్ తెలిపారు. తనిఖీల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య నిర్లక్ష్యం వల్లే రామ్మోహన్ మృతి

మణుగూరు టౌన్, జూలై 30 : ఈ నెల 22న ముత్యాలమ్మనగర్‌లో కారులో గ్యాస్‌లీకై కారు దగ్ధమైన సంఘటనలో సింగరేణి కార్మికుడు రామ్మోహన్ తీవ్రగాయాల పాలైన హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమని టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్ అన్నారు. మంగళవారం ఆయన మణుగూరులో మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన రోజు క్షతగాత్రులను హైదరాబాద్ తరలించడంతో పాటు కేర్ అస్పత్రిలో జాయిన్ చేయించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి చాలా ఆలస్యం చేశారని ఆరోపించారు. అనంతరం ఆరు గంటల తర్వాత మరో వెల్‌నెస్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారన్నారు. ప్రమాదంలో రామ్మోహన్ భార్య తీవ్రంగా గాయపడి మణుగూరు ప్రాంతీయ వైద్యశాలకు వస్తే కనీసం ఫ్లుయిడ్ కూడా చేయకుండా కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించడం దుర్మార్గమైన చర్య అన్నారు. రామ్మోహన్‌కు అందించిన వైద్య సేవలపై యాజమాన్యం విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మండలంలో 58.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

దుమ్ముగూడెం, జూలై 30: మండలంలో మంగళవారం కురిసిన వర్షానికి 58.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ తెలిపారు. దీంతో లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరి ఇళ్లల్లోకి వచ్చాయి. అచ్యుతాపురం రహదారిపైకి వరదనీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

పంచాయతీ కార్మికుడి మృతి

అశ్వారావుపేట టౌన్, జూలై 30: మేజర్ పంచాయతీలో పని చేస్తున్న పంచాయతీ కార్మికుడు కోటగిరి రామకృష్ణ (70) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. పంచాయతీలోని నందమూరినగర్ కాలనీలో గత 30 ఏళ్ళుగా పంప్ ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు. పంచాయతీ ఈవో గజవెల్లి హరికృష్ణ, కార్మికులు కామేశ్, అప్పన్న, నాగేంద్ర, మురళీ, నందు, సుబ్రహ్మణ్యం, విజయ్, భవానీ ప్రసాద్‌లు రామకృష్ణ భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

కొత్తగూడెం టౌన్, జూలై 30: చెక్‌బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం రెండో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సాయిశ్రీ మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి.. కొత్తగూడేనికి చెందిన ఇలమోలు ఉదయభాస్కర్‌రావు వద్ద లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కాలనీకి చెందిన నూతలపాటి మురళీధర్‌రావు రూ.25 లక్షలు అప్పుగా తీసుకొని ప్రామిసరీ నోటు రాసి ఇచ్చాడు. 2017 డిసెంబర్ 15న రూ.20 లక్షలకు మురళీదర్‌రావు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును ఉదయ్‌భాస్కర్‌రావు తన బ్యాంకు ఖాతాలో వేయగా బౌన్స్ అయింది. కోర్టులో వాదనలు పూర్తయిన అనంతరం మురళీధర్‌రావుపై నేరం రుజువుకాగా సంవత్సరం జైలు, రూ.20 లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు. ఫిర్యాదుదారు తరపున న్యాయవాది రమేష్‌కుమార్ మక్కడ్ వాదించారు.

న్యూ కాలనీలో చోరీలు

జూలూరుపాడు, జూలై 30: మండల కేంద్రంలోని న్యూ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం, బడ్డీ కొట్టుతో పాటు ఓ ఇంట్లోలోని నగలు, నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని న్యూ కాలనీకి చెందిన సమందుల నాగేశ్వరరావు ఇంటిపక్కన ఉన్న గది తాళం తీసి బీరువా తీసి ఉండడంతో అందులో ఉన్న రూ.50వేలు, బంగారు గొలుసు, చెవి దిద్దులు, ఉంగరం, చెవి రింగులు ఎత్తుకెళ్లారు. దీంతోపాటు సమీపంలో ఉన్న బడ్డీ కొట్టును పగులగొట్టి రూ.1500 చిల్లరతో పాటు సామాన్లు చోరీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టి లోపల ఏమీ లభించకపోవడంతో వెనుదిరిగారు. బాధితుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై బానోత్ రాణా ప్రతాప్ ఘటనా స్థలాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాణా ప్రతాప్ పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ఆళ్ళపల్లి, జూలై 30: పురుగుల మందు తాగి రైతు మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అనంతోగు గ్రామానికి చెందిన గలిగె సాంబశివరావు మద్యానికి బానిసై మంగళవారం ఉదయం పురుగుల మందు తాగాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఆసుప్రతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ

ఆళ్ళపల్లి, జూలై 30: ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌ను ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను మంగళవారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని ఎస్సైని ఆదేశించారు. అదేవిధంగా పరిసరాలను పరిశీలించి, సీజ్ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్సై రతీష్, ఏఎస్సై వెంకట్‌రెడ్డి, సిబ్బంది కృష్ణమూర్తి, శ్రీనివాస్, రాజేశ్వరరావు, వెంకట్ ఉన్నారు.

డీఎంఎఫ్టీ నిధుల అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పాల్వంచ, జూలై 30: మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్టీ) నిధుల్లో అవినీతి అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కాంట్రాక్టర్ కట్టా వెంకటనారాయణ మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాద